క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. 14 రోజుల్లోపు సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను విస్తృతం చేస్తామని హెచ్చరించారు. మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏడో నంబర్ జీవో నంబర్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 104 ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు.

ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: సీపీఎం ప్రజాపోరును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం శ్యామల సెంటర్‌లో ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టి 150 రోజులు పూర్తయినా, ఎన్నికల హామీలను అమలు చేయడంలో వెనుకబడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతున్నాయన్నారు. కార్మికులు, చిరు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్లతో నవంబర్ 14న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. కాగా.. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని, చిన్న వర్షానికే ముంపు బారిన పడుతున్న పరిస్థితిలో మార్పు తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు.

అక్టోబర్ విప్లవంతో కార్మికులకు అధికారం

ప్రకాశం నగర్: కార్మిక వర్గానికి అధికారం ఇచ్చింది అక్టోబర్ విప్లవమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. 107వ అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శ్యామల సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు పోలిన వెంకటేశ్వరరావు పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా టి.అరుణ్ మాట్లాడుతూ కార్మిక వర్గానికి మొదటిగా హక్కులు ఇచ్చింది సోవియేట్ సోషలిస్టు ప్రభుత్వమన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని ప్రపంచంలో మొదటసారిగా లెనిన్ నాయకత్వంలో రష్యాలో అమలు చేశారన్నారు. యుద్ధాలతో ప్రపంచ శాంతికి విఘాతం కలుగుతుందని, యుద్ధోన్మాదం నశించాలని కోరారు. దేశ సంపదను లూటీ చేస్తూ కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు తులసి, ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

బొమ్మూరులో రేపు శ్రీనివాస కల్యాణం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు విద్యుత్ ప్రాంగణంలోని సంతాన సీతారామాలయం (బొమ్మూరు భద్రాద్రి)లో శనివారం సాయంత్రం 5 గంటలకు అమ్మఒడి సేవాతరంగిణి ఆధ్వర్యంలో 108 ఉచిత శ్రీనివాస కల్యాణాల మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆచార్య చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో సేవాతరంగిణి పుష్కర మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. మహాయజ్ఞంలో భాగంగా బొమ్మూరులో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కల్యాణంలో కూర్చోవడానికి దంపతులకు ప్రవేశం ఉచితమని, అయితే పంచె, కండువా, చీర ధరించి రావాలని తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజిక్ వైకే శ్రీనివాస్ హాజరవుతారన్నారు. మరిన్ని వివరాలకు 89199 69428, 85559 89099, 83330 12666 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ శ్రీరామ్‌నగర్, రాజీవ్‌గాంధీ కాలేజీ ఏరియా, ఏపీపీఎం ఏరియా, సాయిబాబా గుడి, దుర్గా నగర్, మల్లయ్యపేటల్లో సరఫరా ఉండదు.

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొంతమూరు మెయిన్ రోడ్డు, రాజరాజేశ్వరి నగర్, సున్నంబట్టి రోడ్డు, నూకాలమ్మ దేవాలయం ప్రాంతం, అఫీషియల్ కాలనీ, చెంచుకాలనీ, వితంతువుల కాలనీ, భవానీపురం, సంతోష్ నగర్, చందన రమేష్ లేఅవుట్, రావుగారి బిల్డింగ్ ఏరియా, శానిటోరియం ప్రాంతంలో విద్యుత్ నిలిచిపోతుంది.

ఆర్ట్స్ కళాశాలలో సదస్సు

ప్రకాశం నగర్ : జీవ ఆధారిత పర్యావరణం కోసం సుస్థిరమైన భూభాగం అనే అంశంపై గురువారం ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఆర్‌కే రామచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పునరుత్పాదక వనరుల వినియోగం గురించి వివరించారు. ప్రొఫెసర్ రంగరాజు సెల్వరాజు మాట్లాడుతూ ప్రస్తుతం జీవ ఆధారిత రసాయనాలు, వాటిపై జరుగుతున్న పరిశోధనలను వివరించారు.

సీతాఫలం .. మరింత ప్రియం

- ధరలను చూసి భయపడుతున్న ప్రజలు
- ముగుస్తున్న సీజన్
- మార్కెట్ లోకి సోలాపూర్ పండ్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సీతాఫలాలంటే పిల్లల నుంచి పెద్దల వరకూ నోరూరాల్సిందే. వాటి సీజన్ వచ్చిందంటే చాలు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తారు. రోడ్ల పక్కన, మోటారు సైకిళ్లపై, షాపుల్లోనూ వ్యాపారాలు వీటిని విక్రయిస్తూ ఉంటారు. ఎంత రేటు ఉన్నా వీటిని అందరూ ఇష్టపడతారు. ప్రస్తుతం దేశవాళీ సీతాఫలాల సీజన్ ముగుస్తోంది. మరో పక్క సోలాపూర్ సీతాఫలాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వాటిని చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు.

జోరుగా విక్రయాలు

రాజమహేంద్రవరం నగరంలోని స్టేడియం రోడ్డు, కోరుకొండ రోడ్డు, జైలు రోడ్డు, రైల్వేస్టేషన్, గోదావరి గట్టు ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లతో పాటు రూరల్ నియోజకవర్గంలో జాతీయ రహదారి పక్కన, గ్రామాలలో సీతాఫలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాజానగరం, కోరుకొండ, దూబచర్ల తదితర ప్రాంతాల నుంచి వీటిని వ్యాపారులు కొనుగోలు చేసి, స్థానికంగా విక్రయాలు జరుపుతున్నారు.

ముగుస్తున్న సీజన్

దేశవాళీ సీతాఫలాల సీజన్ మరో పది రోజుల్లో ముగియనుంది. చాగల్నాడు ప్రాంతంలో గతంలో చాలా ఎక్కువగా సీతాఫలాల తోటలు ఉండేవి. రియల్ ఎస్టేట్ ప్రభావంతో అవన్నీ తగ్గిపోయాయి. ప్రస్తుతం నామమాత్రంగా ఆ ప్రాంతంలో ఉన్నాయి. ఈ ఏడాది దిగుబడి కూడా తక్కువగా రావడంతో రైతులు చిన్న కాయలను సైతం కోసేసి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.



సోలాపూర్ సీతాఫలాలు

సోలాపూర్ నుంచి దిగుమతి

సీతాఫలాల సీజన్ సాధారణంగా నవంబర్‌తో ముగుస్తుంది. అయితే ఈ సీజన్‌ను మరో నెలన్నర పైబడి కొనసాగించేలా మార్కెట్‌లోకి సీతాఫలాలు దిగుమతి అవుతున్నాయి. యాపిల్స్ బాక్సులతో పాటు సోలాపూర్ నుంచి సీతాఫలాలను కూడా బాక్సుల్లో తీసుకువచ్చి, ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. చూడటానికి చాగల్నాడు సీతాఫలాలను మైమరిపించే రీతి నిగనిగలాడుతూ ఉండే ఈ ఫలాలు రుచి బాగానే ఉంటుంది.

ధర వింటే హడలే..

సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితిలో సీతాఫలాలు ఉండడం లేదు. దేశవాళీ సీతాఫలాలు పెద్దవి డజను రూ.650, చిన్నవి రూ.250కి పైగా పలుకుతున్నాయి. సోలాపూర్ పండ్లు అయితే డజను రూ.750కు విక్రయిస్తున్నారు. ఇంత రేటున్నా ఒక్కసారైనా సీతాఫలాలు తీరాల్సిందేనని ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నారు.



స్టేడియం రోడ్డులో సీతాఫలాల విక్రయాలు

మరో నెల రోజులు విక్రయాలు

సీతాఫలాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. మరో పది రోజుల్లో దేశవాళీ ఫలాల సీజన్ ముగుస్తుంది. సోలాపూర్ సీతాఫలాలు సైతం మార్కెట్‌లోకి వచ్చేశాయి. వాటిని ఇక్కడ కూడా రైతులు పండిస్తున్నారు. దీంతో మరో నెల రోజుల పాటు అమ్మకాలు జరుగుతాయి.



– మణికంఠ, రైతు, శ్రీకృష్ణపట్నం

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతతో కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం స్థానిక జిల్లా కోర్టు కార్యాలయంలో సమావేశమయ్యారు. ముందుగా జిల్లా కోర్టు ఆవరణలోని ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో ఆమెకు కలెక్టరు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో నిర్మాణ దశలో కోర్టు భవనాలు తదితర అంశాలను న్యాయమూర్తికి వివరించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: రక్తదానం మహోన్నతమని విజిలెన్స్ ఇన్‌చార్జి ఇ.రాంబాబు అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా గురువారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ లలితా నగర్ బ్రాంచి ఆధ్వర్యాన రీజినల్ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.విజయ్ కుమార్, రీజినల్ మేనేజర్ డి.సాసయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



అగరుబత్తీ తయారీపై శిక్షణ పొందిన మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం: స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వ్యర్థ పూలతో అగరుబత్తీ తయారీ శిక్షణ పొందిన మహిళలను గురువారం సాయంత్రం ఆమె కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారన్నారు. వారు పారిశ్రామికవేత్తలుగా మరింత ఎదిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థ పూల నుంచి ఆదాయం పొందేందుకు గత నెల 20వ తేదీన తునిలోని అగరుబత్తీ తయారీ యూనిట్‌ను కడియం మండలం మహిళలు సందర్శించారన్నారు. అక్కడ 52 మంది శిక్షణ పొందగా, వారిలో తొలి యూనిట్ స్థాపన కోసం 12 మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. కెనరా బ్యాంక్ సహకారంతో 12 మంది తొలి యూనిట్ స్థాపనకు అడుగులు వేస్తున్నారన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి, జిల్లా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ సంయుక్తంగా గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. శిశుసంరక్షణ దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని మహిళా ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రకాష్ బాబు మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. శిశుమరణాలను అరికట్టేందుకు అందరూ తమవంతు కృషి చేయాలని కోరారు. సీడీపీవోలు నాగమణి, సీహెచ్‌వీ నరసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటనగరం గ్రామానికి చెందిన కొల్లం రవీంద్ర కుమార్ (20) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో కొల్లం రవీంద్ర కుమార్ రాజమహేంద్రవరం నుంచి మోటారు బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. కాతేరు పప్పులమిల్లు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఇతడిని ఢీకొన్న మోటారు సైకిలిస్టుకు కూడా గాయపడి చికిత్స పొందుతున్నాడు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

- జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జక్కంపూడి విజయలక్ష్మి
- కోటగుమ్మంలో అవగాహన సదస్సు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)/రాజమహేంద్రవరం సిటీ: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం కోటగుమ్మం సెంటర్‌లోని చిన్న వర్తకుల మార్కెట్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎస్ఎల్ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేని, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ అధికారి డాక్టర్ జి.హరిశ్చంద్ర హాజరయ్యారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు నివారణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడానికి రెడ్ క్రాస్ సొసైటీ కృషి చేస్తోందన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల బారిన పడుతున్నారన్నారు. ముందుగానే గుర్తిస్తే చికిత్స పొందడం వీలుంటుందన్నారు. జీఎస్ఎల్ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను జయించాలంటే మానసిక ధైర్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరేష్ రాజు, సంయుక్త కార్యదర్శి గొట్టిముక్కల అనంతరావు, సభ్యులు లంక సత్యనారాయణ, మహాలక్ష్మి, శుభాకర్, రమేష్ బాబు,రమణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి, చిత్రంలో డాక్టర్ తరుణ్

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు స్ఫూర్తిదాయకం



వాక్‌థాన్ నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

రాజమహేంద్రవరం సిటీ: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించే కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తాయని విశ్రాంత స్కౌట్ మాస్టర్ బీఎస్ఆర్ శాస్త్రి అన్నారు. స్కౌట్ గైడ్ వీక్‌లో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే స్టేట్ రాజరాజ నరేంద్ర, గోదావరి ఓపెన్ గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం వాకథాన్ నిర్వహించారు. రాజమహేంద్రవరం రైల్వే స్కౌట్ డెన్ నుంచి బొమ్మూరు జంక్షన్ వరకూ జరిగిన ఈ కార్యక్రమాన్ని శాస్త్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్లాగ్ డే ప్రాముఖ్యతను వివరించారు. యోగారత్న కె.శ్రీధర్ రెడ్డి (అంతర్జాతీయ యోగాజడ్జి) పర్యవేక్షణలో యోగాసనాల సాధన చేశారు. కార్యక్రమంలో ఎస్.ఈశ్వర్ ప్రతాప్, బి.నూకరాజు, పి.శ్యామ్, ఎస్.ఇంద్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కడియం: మండలంలోని వీరవరంలో గంగిశెట్టి శ్రీనివాసరావు 18వ శబరిమల యాత్రను పురస్కరించుకుని అయ్యప్పకు లక్షార్చన, పడిపూజా మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అష్టద్రవ్యాలతో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అయ్యప్ప స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాలు, మాలధారుల శరణుఘోష మధ్య గ్రామోత్సవం జరిగింది. తాడాల వీర వెంకట్రావు గురుస్వామి పర్యవేక్షణలో కేరళకు చెందిన నంబూద్రిలతో పూలంగి సేవ, లక్ష బిల్వార్చన, పడిపూజ, అఖండ హారతి, పవళింపు సేవలను కన్నుల పండువగా చేశారు. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన చిన్న స్వామి లక్ష్మీగణపతి శరణం అయ్యప్ప భజన బృందం భక్తిగీతాలను ఆలపించింది. ఈ కార్యక్రమానికి కడియం మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అయ్యప్ప మాలధారులు హాజరయ్యారు.

పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరిగా చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ సామాజిక ప్రయోజనాలను పొందడానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కోసం ఇది అవసరమన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని పోస్టల్ బ్యాంక్ ద్వారా అమలు చేయడానికి, కొత్త బ్యాంక్ ఖాతాలను తెరవడానికి, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కోసం, పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధారును లింక్ చేయడానికి ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. పోస్టాఫీసులో ఖాతా ఉన్నవారు తప్పనిసరిగా ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 7 నుంచి 15 వరకూ పోస్టాఫీసు ఖాతాలు తెరవడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎన్జీ రంగా జయంత్యుత్సవం

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్జీ రంగాను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తామని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. కాతేరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో గురువారం ఎన్‌జీ రంగా జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సీహెచ్ సునీత, ఓఎస్ఏ డాక్టర్ ఎస్‌వీ భవాని ప్రసాద్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా, జైలు

రాజమహేంద్రవరం రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి సి.రమ్య గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సిబ్బందితో కలిసి బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకుని గురువారం కోర్టులో హాజరుపరిచారు. అభి, సత్యనారాయణలకు రూ.10 వేలు చొప్పున జరిమానా, వి.సురేష్, కేఎస్‌వీ దుర్గాప్రసాద్‌లకు రెండురోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమే




కడియంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడియం: పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించవచ్చని డాక్టర్ మణిజ్యోత్స్న అన్నారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారన్నారు. ఆ వ్యాధిపై అవగాహన లేక చివరి దశలో గుర్తించడంతో మరణాల రేటు ఎక్కువగా ఉందన్నారు. ముందస్తు పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహించడం ద్వారా వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి, చికిత్స పొందవచ్చన్నారు. దీనిలో భాగంగా ×అందరికీ కాన్సర్ పరీక్షలు అనే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కాన్సర్‌పై విజయం - స్క్రీనింగ్‌తో సాధ్యం అనే నినాదంతో 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటింటి సర్వే ద్వారా అనుమానితులను గుర్తించి, వారికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి, అవసరమైన చికిత్సను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.నాగసాయిమౌర్య, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ 'దీపం–2' పథకాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి ఆధ్వర్యంలో డీలక్స్ సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వరకు మహిళలు పాలబిందెలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అయితే కూటమిలోని భాగస్వాములైన జనసేన, బీజేపీ నేతలు మాత్రం పిలుపు లేకపోవడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.

సినిమాలు



శ్యామల :	బ్లడీబెగ్గర్
సూర్యమినీ :	రహస్యం ఇదం జగత్
సూర్యప్యాలెస్ :	దూమ్‌ధామ్
శివజ్యోతి :	క
అనుశ్రీ :	క
స్వామి :	అమరన్
అశోక :	లక్కీభాస్కర్
రాజా :	అమరన్
రంభ :	బఘీర, భూల్‌భులయ్యా–3
ఊర్వశి :	అమరన్
మేనక :	జితేందర్‌రెడ్డి
కుమారి :	దేవర
అప్సర :	అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
నామవరం	
వీఎస్ మహల్ :	అప్పుడో ఇప్పుడో ఎప్పుడో ,క
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	అమరన్
కడియం	
వెంకటసూర్య :	క